

పోతాయిపల్లిలో మట్లాడుతున్న అదనపు కల్టెర్ విక్టర్



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు

అకాల భయం

కామారెడ్డి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా రైతులను కారుమబ్బులు భయపెడుతున్నాయి. ఆకాశమంతా కారుమబ్బులు కమ్మేయడంతో రైతులు ఆగమాగం అవుతున్నారు. కేంద్రాల్లోని వరి ధాన్యం పంట పొలాల్లోని వరిని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మరో వైపు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు పూర్తిస్థాయిలో తెరుచుకున్నా కేంద్రాల్లో కొనుగోళ్లు మాత్రం ఊపందుకోవడం లేదు. ఇప్పుడిప్పుడే రైతులు భారీగా ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో అకాల వర్షాలు కురిస్తే ఎక్కడ తడిసిపోతాయోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెనువెంటే నే కొనుగోలు చేసి తరలించాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 102 కేంద్రాల్లో 46వేల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

- జిల్లాను కమ్మేస్తున్న కారు మబ్బులు
- ఇప్పటికే పలుచోట్ల కురిసిన అకాల వర్షాలకు తడిసిపోతున్న ధాన్యం
- పూర్తిస్థాయిలో కేంద్రాలు ప్రారంభమైనా ఊపందుకోని కొనుగోళ్లు
- కేంద్రాల్లో కుప్పలు తెప్పలుగా ధాన్యం రాశులు
- ఎక్కడ అకాల వర్షాలు కురుస్తాయోనని ఆగమవుతున్న అన్నదాత
- చేతికి వచ్చిన పంట ఏమవుతుందోనని రైతుల్లో ఆందోళన
- ఇప్పటి వరకు 46 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోళ్లు

ఆకాశాన్ని కమ్మేస్తున్న మబ్బులు

ప్రతీ యాసంగి సీజన్‌లో కోతలు, కొనుగోళ్ల సమయంలో అకాల, వడగండ్ల వర్షం కురువడం సాధారణమే. సరిగ్గా కోతల సమయంలోనే కురుస్తుండడంతో ప్రతీఏటా రైతుల ధాన్యం తడిసిపోతుండడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఆకాశాన్ని కారుమబ్బులు కమ్మేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అక్కడక్కడ అకాల వర్షాలు కురుస్తుండడంతో కేంద్రాలు, పంట పొలాల్లోని ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆగమవుతున్నారు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

రైతులను భయపెడుతున్న అకాల వర్షాలు

జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ఇప్పుడిప్పుడే తరలిస్తున్నారు. మరికొన్ని చోట్ల వేలాది ఎకరాల్లో వరి కోతలకు సిద్ధంగా ఉన్నాయి. అయితే అకాల వర్షాలు రైతులను భయపెడుతున్నాయి. ఇటీవల లింగంపేట, బీర్కూర్, బాన్సువాడ, నస్రూల్లాబాద్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, బిచ్కుంద తదితర మండలాల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానలతో వందలాది ఎకరాల్లో వరి మొక్కజొన్న, జొన్న, శనగ పంటలకు నష్టం వాటిల్లింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటుండడం, చల్లపడడం, ఆకాశం మబ్బులతో కమ్మేయడంతో ఎక్కడ అకాల వర్షాలు కురుస్తాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరుగులు తీస్తున్న రైతులు

జిల్లాలో వాతావరణం ఉన్నట్టుండి మారి పోవడంతో కేంద్రాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీస్తున్నారు. కోతకు వచ్చిన పొలాలు గాలి దుమారానికి, వర్షానికి అడ్డం పడుతాయని రాశులు ఉన్న ధాన్యం తడుస్తుందేమోనని ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు ఏ గాలి దుమారం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటను కోసి కల్లాలు, కేంద్రాల్లో ఆరబెట్టుకున్న రైతులు కుప్పలుగా పోసి పట్టాలు పట్టుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సరిపడ టార్పాలిన్‌లు అందుబాటులో లేకపోవడంతో తెలిసిన వారి వద్ద కొనుగోలు చేసి ధాన్యం రాశులపై కప్పుకుం టున్నారు.

46 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జిల్లాలో ఇప్పుడిప్పుడే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం అవుతున్నాయి. రైతులు సైతం ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. ఈ యాసంగి సీజన్‌లో 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లకు అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా 446 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు అన్ని కేంద్రాలను ప్రారంభించగా ఇందులో 102 కేంద్రాల్లో 46,447 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 4,588 మంది రైతుల నుంచి కొనుగోలు చేపట్టారు. ఇందులో రూ.32.64కోట్ల ధాన్యం డబ్బులను ఆయా రైతుల ఖాతాలో జమ చేశారు. ప్రస్తుతం బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్‌ల పరిధిలో వరి కోతలు పూర్తవడమే కాకుండా ధాన్యాన్ని కేంద్రాలకు రైతులు తరలిస్తుండడంతో కొనుగోళ్లు చేపడుతున్నారు. కామా రెడ్డి డివిజన్ పరిధిలో వరి కోతలకు సిద్ధంగా ఉంది. అయితే ఈ సీజన్‌లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలించేం దుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పలు రైస్‌మిల్లులకు కేటాయించారు. ఈ రైస్‌మిల్లులోని ఎక్కువ మిల్లులు కామారెడ్డి డివిజన్ ప్రాంతంలో ఉండడంతో బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి డివిజన్ ప్రాంతాల నుంచి కామారెడ్డికి తరలించేం దుకు కాస్తా ట్రాన్స్‌పోర్టు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.

ధరణి లోపాలను సవరించిన

నూతన చట్టమే భూ భారతి

- దరఖాస్తులను నెల రోజుల్లో పరిష్కరిస్తాం
- పైలెట్ మండలంగా లింగంపేట ఎంపిక కావడం రైతుల అదృష్టం
- మొదటి రోజు పోతాయిపల్లిలో 260, బోనాల్‌లో 47 దరఖాస్తులు
- అదనపు కలెక్టర్ విక్టర్

లింగంపేట, ఎప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ధరణిలోని లోపాలను సవరించిన నూతన చట్టమే భూ భారతి అని అదనపు కలెక్టర్ విక్టర్ (రెవెన్యూ) అన్నారు. ఆయన గురువారం లింగంపేట మండలంలోని పోతాయిపల్లిలో నిర్వహించిన భూ భారతి గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో భూ భారతి పైలెట్ మండలంగా ఎంపికైన నాలుగు మండలాల్లో లింగంపేట మండలం ఉండడం రైతుల అదృష్టమని ఆయన అన్నారు. లింగంపేట మండలంలో భూ వివాదాలు అత్యధికంగా ఉన్నాయని ఈనెల 30 వరకు రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించి వారం రోజుల్లో రైతులకు నోటీసులు ఇచ్చి నెల రోజుల్లో సమస్యలు పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని ఆయన తెలియజేశారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల్లో అప్పీలు చేసుకునే అవకాశం ఉందని ఆయన తెలిపారు. సమస్యాత్మకంగా ఉన్న భూములను సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు. భూ భారతిలో పహాని విధానం అమలు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. అటవీ భూముల వ్యవహారంలో జయింట్ సర్వే నిర్వహించి గెజిట్ ప్రకారం హద్దులు ఏర్పాటు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరిస్తామని ఆయన తెలియజేశారు. సదా బైనామాల దరఖాస్తులను ఆర్డీవోలు విచారణ చేపట్టి పట్టాలు అందజేస్తారని ఆయన తెలిపారు. సదా బైనామాలతో పాటు పౌతి సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన వెల్లడించారు. ప్రతీ ఒక్కరు భూ భారతి చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలియజేశారు. బోనాల్‌లో ఆర్డీవో ప్రభాకర్ గ్రామసభలో పాల్గొన్నారు. భూ భారతి గ్రామ సభల్లో మొదటి రోజు పోతాయిపల్లిలో 260 దరఖాస్తులు రాగా బోనాల్‌లో 47 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సురేష్ తెలియజేశారు. కార్యక్రమంలో భూ భారతి చట్టం ప్రత్యేక ఎఫ్ఆర్‌వో చరణ్‌తేజ, నయాబ్ తహసీల్దార్ రాందాస్, ఎల్లారెడ్డి రేంజి అధికారి ఓంకార్, ఆర్ఐ కిరణ్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు బుర్ర నారా గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు,సహకార సంఘం డైరెక్టర్ రామలింగం, సిబ్బంది ఉన్నారు.

లింగంపల్లిలో పశువులకు వ్యాక్సినేషన్

లింగంపేట, ఎప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లిలో గురువారం 687 పశువులకు వ్యాక్సినేషన్ వేసినట్లు పశువైద్యురాలు హన్నాహ జోనస్ తెలిపారు. గాలికుంటు, జబ్బరోగం వ్యాధులతో పాటు పలు రోగాలకు ఈ వ్యాక్సిన్ పని చేస్తుందని ఆమె తెలియజేశారు. 412 గొర్రెలకు, 275 గేదెలకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. రైతులు తప్పని సరిగా వ్యాక్సినేషన్ వేయించాలన్నారు.

వక్ఫ్ బిల్లుపై కోర్టు ద్వారానే పోరాడుతాం

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌బిల్లుపై కోర్టు ద్వారానే పోరాడుతామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ గురువారం అన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశానని తెలిపారు. ఈ కేసును సల్మాన్ ఖుర్షిద్ బృందం వాదిస్తుందని తెలిపారు. పార్లమెంట్ ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భగ అంశాల్లో తలదూర్చడమేనని అన్నారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని సుప్రీంకోర్టుకు తెలిపామన్నారు. చట్టం ప్రకారం అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందని తెలిపారు. వక్ఫ్అలల్ ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరంచరాదని దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదన్నారు. ఎవరైన వక్ఫ్ స్థాపించాలంటే అతను ఐదేళ్ల ఇస్లాంను పాటిస్తున్నాడని నిరూపించుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఆస్తుల సర్వే బాధ్యత కలెక్టర్‌కు ఇచ్చారని ఇది రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్, బోర్డులో భాగమని సవరణ తర్వాత హిందువులు కూడా భాగం కావొచ్చని తెలిపారని ఇది పార్లమెంటరి చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని తెలిపారు. సుప్రీంకోర్టుపై తమకు పూర్తిస్థాయి నమ్మకం ఉందని తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు.



అధ్యాపకులను అదుపులోకి తీసుకున్న దృశ్యం

సౌత్ క్యాంపస్ పార్ట్‌టైం అధ్యాపకుల ముందస్తు అరెస్టు

భిక్కనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బీటీఎస్ చౌరస్తాలో గల తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ పార్ట్ టైం అధ్యాపకులను చలో సెక్రెటేరియట్ కార్యక్రమం నేపథ్యంలో గురువారం తెల్లవారు జామున భిక్కనూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాంతియుతంగా ప్రభుత్వానికి తమ సమస్యలను విన్నవించడానికి తలపెట్టిన చలో సెక్రెటేరియట్ కార్యక్రమాన్ని భగనం చేయడానికి పోలీసులు తమను అక్రమంగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికమైన చర్యని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి రాగానే తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి రాగానే తమను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే జీవో నెం.21ను రద్దు చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని లేనియెడల ఉద్యమాన్ని ఉదృతం చేస్తామన్నారు. అరెస్ట్ అయిన పార్ట్‌టైం అధ్యాపకులను పోలీసుస్టేషన్‌లో బీఎంఎస్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి పరామర్శించి వారికి మద్దతు తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో ఇంద్రకరణ్‌రెడ్డి, కనకయ్య, కేతావత్ శ్రీను, పోతన ఉన్నారు.

నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలి

భిక్కనూరు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నర్సరీల్లో మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని భిక్కనూరు ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి అన్నారు. గురువారం భిక్కనూరు మండలంలోని బాగిర్తిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి గ్రామంలోని నర్సరీ, డంపింగ్ యార్డు, వైకుంఠ ధామం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలోని మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, కంపోస్టు షెడ్డులో సేంద్రియ ఎరువును తయారీ చేయాలన్నారు. నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.



బాగిర్తిపల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

డీఎంఈ డైరెక్టర్ నరేంద్రకుమార్

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన సేవలు అందేలా చూడాలని డీఎంఈ డైరెక్టర్ నరేంద్రకుమార్ వైద్యులకు సూచించారు. గురువారం కామరెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. పలు విభాగాలను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. అంతకుముందు మెడికల్ కళాశాలను పరిశీలించడంతో పాటు నిర్మాణంలో ఉన్న కళాశాల, హాస్టల్ భవనాలను పరిశీలించారు. పనులు వేగిరంగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల లో మెరుగైన సేవలతో పాటు సౌకర్యాల కల్పనకు కృషి చేస్తుందని తెలిపారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల మాదిరి సేవలు అందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నారని తెలిపారు. ఆసుపత్రి చిన్నగా ఉండడంతో రోగులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని త్వరలోనే ఆసుపత్రి భవనంతో పాటు కళాశాల భవనం నిర్మాణం జరగగానే రోగులకు మంచి సేవలు అందేలా చూస్తామని తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫరీదా సిబ్బంది కొరత, గైనిక్ వైద్యుల కొరతతో గర్భిణులు పడుతున్న ఇబ్బందులను డైరెక్టర్‌కు వివరించారు. ఆసుపత్రిలో ఐసీయూ బెడ్ల పెంపు విషయంపై చర్చించారు. సిబ్బంది సమయపాలన పాటించేలా చూడాలని సూపరింటెండెంట్‌కు డైరెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌తో సమావేశమై నిర్మాణ పనులతో పాటు పలు అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, వైద్యులు బన్సిలాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో చేపట్టిన అక్రమ నియామకాలపై విచారణ జరపాలి

మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ ప్రతిపాదికన చేపట్టిన అక్రమ నియామకాలపై విచారణ జరపాలని డీఎంఈ డైరెక్టర్ నరేంద్రకుమార్‌కు విద్యార్థి సంఘ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలల్లో ఇష్టారీతిన నియామకాలు చేపడుతున్నారని అసలు అర్హత లేనివారికి ఉద్యోగాలు ఇచ్చి అర్హతలు ఉన్న వారిని పక్కన పెట్టారని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ నిర్వాహకులు కొంత మంది దగ్గర డబ్బులు తీసుకుని వాళ్లకు మాత్రమే రాత్రికి రాత్రి ఫోన్‌లు చేసి ఆర్డర్ కాపీలు అందించారని తెలిపారు. మెరిట్ లిస్టులో మొదటి ప్లేస్‌లో ఉన్న వారికి కాకుండా 6,7 ప్లేస్‌లలో ఉన్న వారికి జాబ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇదేంటని ఏజెన్సీ నిర్వాహకులను ప్రశ్నిస్తే నియామక పత్రాలు అందించిన తర్వాత మెరిట్ లిస్టు వేసి అందులో బోనాఫైడ్స్ ఇవ్వలేదని, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికేట్‌లో డేట్ లేదని పొంతనలేని విధంగా రిమార్క్‌లో రాశారని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లో ఉన్న తేదీ జిరాక్స్‌లో ఎందుకు లేదో సమాధానం చెప్పడం లేదని మంచి మెరిట్ ఉన్నవాళ్ల సర్టిఫికెట్లు మార్చి వారికి అనుకూలంగా డబ్బులు ఇచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చారని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్ పాయింట్ పాటించకుండా నిబంధనలు అతిక్రమించిన మ్యాన్ పవర్ ఏజెన్సీ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అధికారులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీంతో డైరెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ద్వారా నియామకాలు చేపట్టేటప్పుడు కలెక్టర్ చైర్మన్‌గా ఉంటారని ఇందులో తమ ప్రమేయం ఏమి ఉండదని కలెక్టర్‌తోను తాను మాట్లాడతానని, తమ సిబ్బంది ప్రమేయం ఉంటే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు విఠల్, నాగరాజు, అరుణ్, వినోద్‌నాయక్, బాధిత అభ్యర్థులు రవి, సురేష్, అరవింద్, మహేష్, గణేష్, మమత, రఘువీర్, పీర్యానాయక్, ప్రవీణ్, ఆనంద్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో విభాగాలను పరిశీలిస్తున్న డీఎంఈ డైరెక్టర్

బస్సు సమయాలు తెలుసుకునేందుకు నెంబర్ల ఏర్పాటు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): టీజీఎస్ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్‌లోని బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుంచి అన్ని ప్రాంతాలకు వెళ్లు బస్సు సమయాలు తెలుసుకునేందుకు ఫోన్ నెంబర్‌లు ఏర్పాటు చేశామని రీజినల్ మేనేజర్ జోస్నా తెలిపారు. కామారెడ్డి డిపోకు సంబంధించి బస్సుల వివరాల కోసం 73828 43747, బాన్సువాడ డిపోకు సంబంధించి బస్సుల వివరాల కోసం 94911 05706 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సురక్షిత, సుఖవంతమైన ప్రయాణంతో గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు.

మాచారెడ్డి పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

మాచారెడ్డి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి పోలీసుస్టేషన్‌ను ఎస్పీ రాజేష్‌చంద్ర గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. గ్రామ పోలీసు అధికారులకు కేటాయించబడిన గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపి విజిబుల్ పోలీసింగ్ ఉండాలని తెలిపారు. హిస్టరి షీటర్స్, సస్పెక్ట్స్, పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, నైట్ బీట్, పెట్రోలింగ్ అధికారులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సిబ్బంది వాహనాలు నడిపించేటప్పుడు రోడ్డుభద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ తెలిపారు.

భూ భారతి చట్టంపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

మాచారెడ్డి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టంపై జిల్లాలోని ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతీ మండల కేంద్రంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులను ప్రారంభించారు. గురువారం పాల్వంచ, మాచారెడ్డి రైతువేదికల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతి చట్టం 14 ఏప్రిల్ 2025న ప్రారంభించిందన్నారు. చట్టంపై ప్రజలకు, రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ధరణి స్థానంలో భూ భారతి, భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఇందులో అన్ని రకాల అప్లికేషన్స్ ఉన్నాయని, హక్కుల రికార్డులలో తప్పుల సవరణ చేసుకోవచ్చని, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం జరుగుతుందని తెలిపారు. 2014 జూన్ 2 కంటే ముందు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేసి గడిచిన 12 ఏళ్లుగా అనుభవంలో ఉంటూ మధ్యకాలంలో క్రమబద్ధీకరణ కోసం రైతులు పెట్టుకున్న దరఖాస్తులపై ఆర్డీఓలు విచారణ చేసి అర్హత ఉన్న వారికి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యూటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ, పాసు పుస్తకాలలో భూమి పటం, భూముల సమస్యలు పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉంటుందని తెలిపారు. తహసీల్దార్ చేసిన మ్యూటేషన్లపై లేదా జారీ చేసిన పాస్ పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్‌డీఓకు అప్పిలు చేసుకోవచ్చని తెలిపారు. ఆర్‌డీఓ వీణ మాట్లాడుతూ మార్పులు, చేర్పులకు తహసీల్దార్ నుంచి ఆర్‌డీఓలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాదా బైనామాలు, వారసత్వంగా వచ్చిన భూములపై 30 రోజుల్లోగా విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ చట్టంపై అవగాహన కల్పించుకుని వారికి ఉన్న సమస్యలకు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో మండల ప్రత్యేకాధికారులు శ్రీపతి, సురేష్,తహసీల్ధార్‌లు హిమబిందు, శ్వేత, ఎంపీ డీఓలు శ్రీనివాస్, గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కల్తీకల్లుపై అవగాహన కల్పించాలి

కల్తీకల్లు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన చేపట్టనున్నట్లు కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నార్కోటిక్స్ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీర్కూర్, నస్రూల్లాబాద్, గాంధారి మండలంలో కల్తీకల్లును తాగడం వల్ల బాధితులు బాన్సువాడ, కామారెడ్డి, నిజామాబాద్ ఆసుపత్రుల్లో చేరారని తెలిపారు. నేరస్తులపై క్రిమినల్ కేసులు నమోదుచేశారని ఈ రకమైన వ్యసనం నుంచి బయటపడడానికి ఆ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శనివారం ఉదయం రెండు గ్రామాలు, మధ్యాహ్నం రెండు గ్రామాలలో అవగాహన చేపట్టాలని అన్నారు. పౌరసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్‌లు, లోకల్ పోలీసు సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, మండల సమైక్యలను పాల్గొనేలా అవగాహన చేపట్టాలని అన్నారు. పీహెచ్‌సీ వైద్యుడు, ఎస్ఐ, ఎక్సైజ్ శాఖ, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీయంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మీ, నార్కోటిక్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెంటాఖుర్దు పాఠశాల సందర్శన



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంటాఖుర్దు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చదువు సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులు ఏఏ సబ్జెక్టులో బలహీనంగా ఉన్నారో గుర్తించి వారికి ఆయా సబ్జెక్టుల్లో అర్థమయ్యేలా బోధించి ఉత్తీర్ణులు అయ్యేలా చూడాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచాలని ప్రధానోపాధ్యాయున్ని ఆదేశించారు.

భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



పోలీసుల గౌరవవందం స్వీకరిస్తున్న సీపీ

భీమ్‌గల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయిచైతన్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో సమావేశం నిర్వహించారు. కేసుల ఫైల్‌ను పరిశీలించి పలు విషయాలను సీఐ సత్యనారాయణ గౌడ్ ఎస్సై మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ శాంతి భద్ర తల పరిరక్షణకు పోలీసులు క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. గంజాయి, వడ్డీ వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని గ్రామాలలో చట్టాన్ని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సీపీ వెంట ఆర్మూర్ ఏసీపీ, ఎస్సైలు ఉన్నారు.

పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలి



చిన్నారులకు అన్నప్రసరణ చేస్తున్న అంగన్‌వాడి సూపర్‌వైజర్

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని అంగన్‌వాడి సూపర్ వైజర్‌లు నలిని, వెంటకరమణమ్మ తెలిపారు. గురువారం పట్టణంలోని అశోక్‌నగర్, హుస్నాబాద్ అంగన్‌వాడి కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 7 నెలల చిన్నారులకు అన్నప్రసరణ కార్యక్రమాన్ని నిర్వహించి పోషక విలువలుగల ఆహారాన్ని ఎలాతయారు చేసుకోవాలో ఆమెతెలియజేశారు. అనంతరం గర్భవతులకు సీమంతాలు చేశారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడి టీచర్ పద్మ, ప్రతిభ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోటగిరి: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని కోటగిరి డిప్యూటీ తహసీల్దార్ మధు సూచించారు. కోటగిరి మండల కేంద్రంలోని రచ్చగల్లీ అంగర్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఎడపల్లి:మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ పద్మ ఆధ్వర్యంలో మండల స్థాయి పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కిషోర బాలికలలో ఉండే రక్తహీనతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, అర్హులైన గర్భవతి మహిళలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శంకర్, మండల వైద్యాధికారి వినీత్ రెడ్డి, ఏపీఎం గంగారాం, మండల ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ రాణి, పోషణ అభియాన్ జిల్లా సమన్వయకర్త రాంబాబు, మండల అంగన్‌వాడీ టీచర్లు, గర్భవతులు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా గురువారం వేల్పూర్ సెక్టర్ పరిధిలో గ్రామ పంచాయితీ భవనంలో పోషణ ఎక్షం కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సీహెచ్‌వో నారాయణ, శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలుసమంత, రాధిక, అంగన్‌వాడీ టీచర్లు వసంత, వీణ,సరోజ,మీనాకుమారి,రూపలత, మంజుల, శ్రావణ్య పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని మావందిఖుర్దు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో పద్మజ మాట్లాడుతూ గర్భవతులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ గోపిలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట రమణ, గ్రామ సెక్రెటరీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):మండలంలో అన్ని గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ గ్రామపంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశారు. గురువారు మండలంలోని మెండోర, లాఖ్యానాయక్ తండా, బాబానగర్, తాళ్లకుంట తండా, పురానిపేట్ గ్రామాల్లో ఎంపీడీవో పర్యటించారు.ఆయన వెంట మిషన్ భగీరథ ఏఈ అమూల్య, గ్రామాల కార్యదర్శులు,కారోబార్లు తదితరులున్నారు.

అనుమతులు లేకుండా మొరం తరలిస్తే చర్యలు

ఎడపల్లి, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం ఎడపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ టిప్పర్‌లో అక్రమంగా మొరం తరలిస్తున్నారనే సమాచా రం మేరకు తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలించడంతో టిప్పర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. అక్రమం గా అనుమతులులేకుండా మొరం,ఇసుకతరలిస్తే చర్యలు తప్పవ న్నారు.

బీజేపీ కార్యకర్తలకు బీమా సౌకర్యం

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బీజేపీ కార్యకర్తలకు ఎటువంటి సహయ, సహకారాలు అందించేందుకు కృషి చేస్తానని బాన్సువాడ నియోజకవర్గ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ హామీ ఇచ్చారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం వందమంది బీజేపీ కార్యకర్తలకు తపాలా శాఖ ఆధ్వర్యంలో భీమా సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నవీన్, శ్యామల, రాజు, శ్రీనివాస్, రాజాగౌడ్, సాయిలు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి

బోధన్‌రూరల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని పాండుఫారం, ఆటోనగర్, బెల్లాల్ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఇళ్ల స్థలాలను, ఇందిరమ్మ ఇళ్లను ఇవ్వడం జరిగింది. కాని ఇప్పటి ఆ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించలేదని సీపీఎం నాయకులు శంకర్ గౌడ్, ఏశాల గంగాధర్‌తో పాటు కాలనీవాసులు గురువారం తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు గంగాధర్, గోపి, దత్తు, ప్రభాస్, తాహెరా బేగం, పోచమ్మ, రాజవ్వ, తిమ్మప్ప, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి అమానుషం'



మోర్తాడ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మోర్తాడ్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):భీమ్‌గల్‌లో బుధవారం జరిగిన మంత్రి జూపల్లి కృష్ణారావు సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని మండల టీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్యాణలక్ష్మీ, షాదీము బారక్ లబ్ధిదారులకు రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని సీఎం ఇచ్చిన హామీని గుర్తుచేస్తూ బంగారం ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించినందుకు టీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయించ డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు అన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ రవి, మాజీ వైస్ఎంపీపీ శ్రీనివాస్, పీఏటీఎస్ బద్దం అశోక్‌రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు చిరంజీవి, కల్లెడ ఏలియా, మాజీ ఎంపీటీసీలు అశోక్, భోగ ఆనంద్, ఏనుగు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

● సీఎంపై చీటింగ్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు

కమ్మర్‌పల్లి: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.లక్షలతో పాటు తులంబంగారం ఇస్తామని మోసం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసునమోదు చేయాలని కమ్మర్‌పల్లి మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చి16 నెలుగడుస్తున్న తులం బంగారం ఊసేలేకుండా పోయిందని. ఇదేవిషయాన్ని నిన్న(బుధవారం) భీమ్‌గల్ పట్టణంలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో జరిగిన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ప్రతిపక్ష ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి లబ్ధిదారుల పక్షాన ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని మంత్రి జూపల్లి, పోలీసులను ఉసిగొల్పి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జి చేయించడం అమానుష చర్య అని తీవ్రంగా ఖండించారు. లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామన్న హామీని విస్మరిస్తూ మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చీటింగ్ కేసునమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, మాజీ సర్పంచ్‌లు గడ్డం స్వామి, బక్కూరి గోపి, దయ్యదేవయ్య, మాజీ వైస్ ఎంపీపీ కలెరి శేఖర్, మాజీ ఎంపీటీసీలు సుధాకర్, పిప్పెర అనిల్, గంగాధర్, కోనాపూర్ సింగిల్ విండో ఛైర్మన్ బడాల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ప్రకాశ్ నాయక్, నాయకులు ఆవారి మురళి, రెంజర్ల మహేందర్, కేకే నరేందర్, కోరి నర్సయ్య, మహేష్, పేరం లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ప్రశ్నించిన నాయకులు, కార్యకర్తలపై లాఠీచార్జీ చేయించడాన్నితీవ్రంగా ఖండించారు.ఎన్నికల హామీలను అమలుచేయాలన్నారు.

బాల్కొండ: బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని బాల్కొండ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి అన్నారు. గురువారం బాల్కొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరినందుకు పోలీస్‌లచే బీఆర్ఎస్ నాయకులను కొట్టించడం ఎంతవరకు సమంజసమన్నారు. లాఠీచార్జి చేసిన పోలీస్‌లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాని డిమాండ్ చేశారు. సమావేశంలో సొసైటీ ఛైర్మన్ సురాజ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ దాసరి వెంకటేష్, ప్రసాద్‌గౌడ్, సాగర్‌యాదవ్, సాయన్న, శ్రీకాంత్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

మెండోర:రాజకీయ పార్టీల నాయకులు నిరసన తెలిపితే లాఠిచార్జి చేయడం సిగ్గుచేటని డీసీసీబీ డైరెక్టర్ మండల పార్టీ అధ్యక్షుడు నాగంపేట శేఖర్ అన్నారు. గురువారం మెండోరలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాల్కొండ నియోజక చరిత్రలో ఏనాడు కూడా లాఠిచార్జి జరగలేదని మంత్రి జూపల్లి వచ్చిన సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ప్లాకార్డుతో నిరసన తెలిపితే మంత్రి వెళ్లిన తర్వాత బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేసి స్థానిక నాయకులు పోలీస్‌లను ఇసుగొలిపి లాఠిచార్జి చేయించడం ఎంతవరకు సమంజసం అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు తలారి గంగాధర్, నవీన్‌గౌడ్, మచ్చర్ల రాజారెడ్డి, సామగంగారెడ్డి, గోపిడి గంగారెడ్డి, రవిగౌడ్, బాబా, రాజు, వెంకట్, దేవేందర్ పాల్గొన్నారు.

వేల్పూర్: భీమ్‌గల్‌లో మంత్రి సాక్షిగా బుధవారం బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జికి కారకులైన కాంగ్రెస్ నాయకులు పోలీస్‌లపై చర్యలు తీసుకోవాలని వేల్పూర్ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వేల్పూర్‌లో పార్టీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మంత్రిని విన్నవించడానికి వెళ్లిన తమ బీఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జి చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తల సంఖ్య బలం బాగా ఉన్నప్పటికి తాము సమన్వయం పాటించి తులం బంగారం ఇవ్వాలని నిరసన తెలుపుతున్న క్రమంలో కాంగ్రెస్ నాయకుడు సునీల్‌కుమార్‌రెడ్డి సూచనల మేరకు పోలీసులు లాఠీచార్జి చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జైడి నాగధర్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు సామ మహిపాల్, రేగు ల రాములు, ప్రతాప్‌రెడ్డి, డొల్ల రాజేశ్వర్‌రెడ్డి, నల్లరమేష్, కే. శ్రీనివాస్‌రెడ్డి, పిట్ల సత్యం, శ్యాంరావ్, మొండి మహేష్, మోహన్‌దాస్, సుంకరి రాము, ఆమోస్, ఏలేటి మోహన్, బోజన్న, నాయకులు పాల్గొన్నారు.

ఏర్గట్ల: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. భీమగల్‌లో బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి నేడు లక్ష రూపాలే ఇవ్వడం పట్ల ప్రశ్నించినందుకు దాడులు పాల్పడం సరికాదని అన్నారు. ఇట్టి దౌర్జన్యానికి కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎనుగందుల రాజాపూర్ణానందం,మాజీఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ జక్కని మధుసుధన్, బద్దం ప్రభాకర్, రొక్కెడ మోహన్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయించాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రోహిత్‌రెడ్డి



అంకాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పశువుల పెంపకందారులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలంలోని అంకాపూర్‌లో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉన్న గేదెజాతి, గోజాతి పశుశులన్నింటికీ టీకాలు వేయించాలన్నారు. పాడి పశువుల పెంపకందారులు అధిక పాలదిగుబడి పొందేం దుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.వేసవిలో పాడి పశువులను జాగ్రత్తగా చేసుకోవాలని సూచించారు.అనంతరం గ్రామస్థులతో మాట్లాడి పశువై ద్యం అందుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో మండల పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్‌లక్కం ప్రభాకర్,పశువైద్య సిబ్బంది రాజేశ్వర్, శ్రీనివాస్ గౌడ్,రాధ,దివ్య, శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలోని దొన్కల్ గ్రామంలో గురు వారం పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈకార్యక్రమాన్ని జిల్లా పశువైద్యశాఖ, పశుసంవర్ధశాఖ సంచాలకులు డాక్టర్ రోహిత్‌రెడ్డి పర్యవేక్షించారు. పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడడంవల్ల నోటిలో పుండ్లతో సొంగ కారడం, కాలీ డెక్కాలలో పగుల్లు ఏర్పడి నడవలేక పోవడం, పాల ఉత్పత్తి తగ్గిపోవడం, సూడి పశువుల్లో అబార్షన్ అవ్వడం వంటి లక్షణాలు ఏర్పడతాయని రైతులతో అన్నారు. రైతులు ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా పశువులకు వేయిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు అనిల్, ఏలేటి రాజేశ్వర్, అశోక్, బద్దం అనిల్, పవువైద్యాధికారి డాక్టర్ గౌతంరాజు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎడపల్లి: పశు పోషకులు తమ పశువులకు గాలికుంటు టీకాలు తప్పక వేయించాలని మండల పశువైద్యాధికారి అన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని పశువులకు గాలికుంటు టీకాల కార్యక్రమం చేపట్టి పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈకార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది మహేందర్, సుశాంత్,పోశెట్టి, ఖాసిప్,పశుపోషకులు పాల్గొన్నారు.

ముప్కాల్:బాల్కొండ మండల కేంద్రంలో గురువారం 262 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి గౌతంరాజు తెలిపారు.కార్యక్రమంలో గ్రామ పెద్దమనుష్యులు మహేష్, గంగాధర్, నర్సయ్య, పశువైద్య సిబ్బంది ప్రవీణ్, ప్రనీత్, షకీల్, మల్లేష్ పాల్గొన్నారు.

కోటగిరి: రుద్రూరు మండల కేంద్రంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని వైద్యాధికారి సంతోష్ ప్రారంభించారు. ప్రభుత్వ పశువుల ఆసుపత్రిలో 48గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో శుక్రవారం నుండి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందించడం జరుగుతుందని నవీపేట వెటర్నరీ వైద్యుడు నరేందర్ తెలిపారు. మండలంలో సుమారు 11 వేల వరకు తెలుపు, నలుపు పశువులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మహంతం, అబ్బాపూర్(ఎం)లలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని ఆయన వివరించారు.

జక్రాన్‌పల్లి: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని డీవీఏహెచ్‌వో అధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అర్గుల్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాదికారి హర్షిత, దేవీవో డాక్టర్ సంకీర్తన, వోఎస్‌లు సర్పంచ్‌లు గోర్త రాజేందర్, పద్మ, రైతులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి బాలిక ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులోని మహాలక్ష్మీ అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి చిట్యాల నీత (16) అనే బాలిక ఆత్మహత్య చేసుకుందని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలి పారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం చేపూర్‌లోని క్షత్రియ పాలి టెక్నిక్ కళాశాలలో రెండో సంవత్సరం విద్యనభ్యసిస్తున్న నీత గత కొన్ని నెల లుగా కడుపునొప్పితో బాధ భరించలేక బుధవారం రాత్రి అపార్ట్‌మెంట్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకుందని అన్నారు.మృతురాలి తల్లి మంజులా ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలి

● వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ

బోధన్‌రూరల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ అందించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ అన్నారు. గురువారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 19న హైదరాబాద్‌లో విస్తృత సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.దివ్యాంగుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగపిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. వికలాంగులు అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలన్నారు.

రైతులకు బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన

బోధన్‌రూరల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామంలో గురువారం రైతులకు బ్యాకింగ్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంటాకలాన్ సొసైటీ ఛైర్మన్ రాజారెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు బోధన్ బ్రాంచ్ మేనేజర్ లక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ నరేష్ రైతులకు బ్యాంకు రుణాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో యూ డైస్ ప్లస్ వెరిఫికేషన్

నిజాంసాగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలో గతంలో యు డైస్ ప్లస్‌లో నమోదు చేసిన వివరాలను పరిశీలించడానికి డైట్ కళాశాలకు చెందిన ఛాత్రోపాధ్యాయులను పరిశీలకులుగా పంపించడం జరిగింది. ఈ సందర్భంగా నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట కాంప్లెక్స్ పరిధిలోని మాగి ప్రాథమికోన్నత పాఠశాల, గోర్గల్ ప్రాథమిక పాఠశాలలలో గురువారం నాడు పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య పాఠశాల గదుల సంఖ్య, మరుగుదొడ్ల సంఖ్య, ఉపాధ్యాయులు పనిచేయుచున్న వారి వివరాలను సేకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సీఆర్పి బి.శ్రీధర్ కుమార్ ఛాత్రోపాధ్యాయురాలు షైక్ హన్సీసా, గోర్గల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఉపాధ్యాయులు శివశంకర్, మాగి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సమీనా బేగం ఉపాధ్యాయులు భీమ్ రావు, ప్రవళిక, విగ్నేశ్వరి, శైలజ పాల్గొన్నారు.

పోచారంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డిపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని రుద్రూరు మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంగయ్య, బాల్‌రాజ్, రాములు, నాగేందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో బాల్య వివాహం

నవీపేట,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరిలో ఈ నెల 14న బాల్య వివాహం జరిగిందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధాలక్ష్మి తెలిపారు. నవీపేటకు చెందిన మైనర్ బాలిక కుటుంబ సభ్యులు గత కొన్ని సంవత్సరాలుగా రెంజల్ మండలం కందకుర్తిలో నివస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ నెల 14న అనంతగిరిలో పద్మనాభ స్వామి ఆలయంలో అదే గ్రామానికి చెందిన 22సంవత్సరాల యువకుడితో నవీపేటకు చెందిన 16సంవత్సరాల బాలికతో వివాహాన్ని కుటుంబ సభ్యులు జరిపించారని ఆమె వివరించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వెంటనే తాము పోలీసుల సహాయంతో సంబంధిత బాలికను నిజామాబాద్‌లోని సఖీ కేంద్రానికి తరలించడం జరిగిందని సూపర్‌వైజర్ పేర్కొన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందన్నారు.

స్నేహితుడి అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన పామయ్యగారి శ్రీకాంత్ గౌడ్ కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే గత కొన్ని రోజులుగా శ్రీకాంత్ గౌడ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. శ్రీకాంత్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బుధవారం రాత్రి చికిత్స పొందుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా తమ చిన్ననాటి మిత్రుడైన శ్రీకాంత్ గౌడ్ చనిపోవడంతో పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు గురువారం అంత్యక్రియల సందర్భంగా 25 వేల నగదును అందజేశారు.

తాగునీటి కోసం కాలనీ వాసుల అవస్థలు

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాటేపల్లి ఎస్సీ కాలనీలో తాగునీరు సరిగ్గా అందక కాలనీవాసులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీకి సంబంధించి ఒకే నల్లా ఉండటంతో దాని నుండే నీరు తీసుకవెళ్తున్నామని కాలనీవాసులు తెలిపారు. చాలా రోజుల నుండి తమకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని, కాలనీలో ఉన్న నల్లా నుండే నీటిని తీసుకవెల్తున్నారు. ప్రస్తుతం వేసవి కాలం కావడంతో నీటికి చాలా ఇబ్బందిగా ఉందని అధికారులు స్పందించి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయం గురించి మిషన్ భగీరథ ఏఈ సాదిక్‌ను వివరణగా కోరగా మిషన్ భగీరథ నీరు వాటర్‌ట్యాంక్ వరకు వెల్తుందని, ఇంట్రా సప్లై తమ పరిధిలోకి రాదని తెలిపారు.

కోమన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌నర్సారెడ్డి

వేల్పూర్, ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి):వేల్పూర్ మండలం కోమన్‌పల్లి గ్రా మంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేల్పూర్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గడ్డం నర్సారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కొనుగోలు కేంద్రం నిర్వహణ బా ధ్యతలు ఐకేపీ మహిళ సంఘానికి కేటాయించడం జరిగిందన్నారు. రైతులు తమ ధాన్యాన్ని మధ్యదళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీఏపీఎం మాణిక్యం, సొసైటీ వైస్ ఛైర్మన్ నవీన్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దామోదర్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు నరేష్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రవీణ్, ఏఈవో ప్రశాంత్, నరేష్, రాజేశ్వర్, సచిన్, గ్రామ కార్యదర్శి సీసీ ప్రవీణ్, గ్రామాభివృద్ధి కమిటి, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మెండోర:మండలంలోని వెల్కటూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వేల్పూర్‌మార్కెట్ కమిటి ఛైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, విక్రంరెడ్డి,రాజేంధర్,రవి,సాయిరైతులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని పిప్రి రోడ్డు, పెర్కిట్ లో గురువారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ రాజు ప్రారంభించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాల న్నారు.ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ,సీవో రాజ లింగం, రైతులు పాల గంగాధర్, బండి పోశెట్టి, కలిగోట్ నడ్పి గంగాధర్, ఖాందేష్‌సత్యం, లక్కాకుల రాజేశ్ పాల్గొన్నారు.

పింక్ డైరీలకు భయపడే నాయకులం కాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆగ్రో ఛైర్మెన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడటౌన్ , ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు అనుక్షణం ప్రజల కోసం కష్టపడి పనిచేస్తారని , ఎవరు ఏ డైరీలలో రాసుకున్నా ఒరిగిదేమిలేదని రాష్ట్ర ఇండస్ట్రీస్ ఛైర్మెన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బాన్సువాడకు విచ్చేసిన ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ నాయకులను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుల పేర్లను పింక్ డైరీలో రాసుకుంటున్నామన్న వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. బాన్సువాడ ప్రజలకు కష్టపడి పనిచేసే నాయకులపై నమ్మకం ఉందని , మాయలోల్ల మాటలు నమ్మరన్నారు. ఏ మహిళ కూడా చేయనటువంటి లిక్కర్ స్కాం చేసి అభాసుపాలైన ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ నాయకులను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. పింక్ డైరీలలో బినామీల పేర్లు రాసుకుని ఆస్తులు కాపాడుకునే నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనవసరపు విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మెన్ జంగం గంగాధర్, గురువినయ్, ఏజాస్, నార్ల సురేష్, ఖాలేక్, చిన్న, అజీం, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వివక్షపై రైతుల ఆగ్రహం

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలంలోని కొత్తపల్లి సొసైటీ పరిధిలో గల లింగాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోళ్లపై సహకార సంఘం అధికారులు వివక్ష చూపుతుండడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం పరిధిలోని రాంపూర్, ఎక్లాస్‌పూర్, సుద్దులం శివారు రైతులకు గన్నీ బ్యాగులు ఇస్తూ లింగాపూర్ గ్రామ రైతుల పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కొత్తపల్లి సహకార సంఘం కార్యదర్శిని గురువారం రైతులు చుట్టుముట్టి నిలదీశారు. లింగాపూర్ శివారులో ధాన్యం పండించిన రైతులు పొతంగల్, రుద్రూరు రహదారిపై ధాన్యం వేయడం వల్ల వాహనరాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు తెలిపారు. ధాన్యం రాసులతో రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. ఈ సమస్యపై సొసైటీ ఛైర్మన్‌కు సమాచారం అందించిన పట్టించుకోవడం లేదని రైతులు వాపోయారు. కార్యదర్శి సైతం లింగాపూర్ శివారు రైతులపై నిర్లక్ష్యం చూపుతున్నారని వారు ఆరోపించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ గంగాధర్ లింగాపూర్ గ్రామానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. గన్నీ బ్యాగులు ఇవ్వడంతో పాటు రెండు రోజుల్లో కాంటాలు పెంచి ధాన్యం తూకం వేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరి జైలుశిక్ష

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కోటగిరి ఉమ్మడి మండలంలో ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్ కేసులో మహారాష్ట్రలోని దెగ్లూర్ గ్రామానికి చెందిన సాయినాథ్ అనే వ్యక్తి పట్టుబడ్డారని ఎస్సై సునీల్ తెలిపారు.సాయినాథ్‌ను కోర్టులో హాజరుపర్చగా సెకండ్‌క్లాస్ న్యాయాధికారి శేషతల్పసాయి ఒకరోజుజైలుశిక్ష విధించడంతో పాటు వెయ్యి రూపాయల జరిమాన విధించారని ఎస్సై తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే ఇక జైలుకే..

మోస్రా:చందూర్ మండలంలోని కారేగావ్ తండా గ్రామానికి చెందిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు. ఉమ్మడి వర్ని మండల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రోజున కారేగాం తండా గ్రామానికి చెందిన కోర్ర కాంగ్య అనేవ్యక్తి మద్యం సేవించి మోటార్ సైకిల్ నడుపుతుండగా అతనికి డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేయగా పరిమితికి మించి మద్యం సేవించి వాహనం నడుపుతున్నారని అతనిపై పెట్టి కేసు నమోదు చేసి బోధన్ కోర్టునందు ప్రవేశపెట్టగా సెకండ్ క్లాస్ న్యాయాధికారి తెలిపిన వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారని ఉమ్మడి వర్ని మండల ఎస్సై మహేష్ తెలిపారు.

అన్నను హత్య చేసిన కేసులో తమ్ముడికి జీవిత ఖైదు

కోటగిరి,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండల కేంద్రానికి చెందిన దిమ్మెల్‌వార్ విఠల్‌కు బోధన్ అడిషన్ న్యాయాధికారి రవి కుమార్ జీవిత ఖైదు విధించినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. పొతంగల్ గ్రామానికి చెందిన దిమ్మెల్‌వార్ గోవింద్(55)అనే వ్యక్తిని అతడి తమ్ముడు విఠల్ 04-04-2024న దారుణంగా హత్య చేశాడు. ఈ కేసులో విఠల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామన్నారు. ఈ కేసులో విఠల్‌కు జీవిత ఖైదు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని ఎస్సై తెలిపారు. ఈ కేసులో బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామ్‌రావు వాదనలు వినిపించారన్నారు.

నేడు కందకుర్తికి హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి రాక

రెంజల్,ఏప్రిల్17(ఆంధ్రజ్యోతి): కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రంలో నేడు లోకమాత అహల్యబాయి విగ్రహ ప్రతిష్టాపనతో పాటు శ్రీ విఘ్నేశ్వర, శ్రీ కుమార స్వామి(స్కంద), రుక్మిణి పాండురంగ, శ్రీకేశవ మూర్తి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమానికి హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి విచ్చేస్తున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మొదటి రోజు విగ్రహాల ఊరేగింపు, రెండవ రోజు గోపూజ, విఘ్నేశ్వర పూజ, నవగ్రహాల మండపూజ, వాస్తుపూజ, పుష్పాదివాసం, గోపూజతో మొదలుకుని ప్రతిష్టాపనను శ్రీశ్రీశ్రీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి చేతులమీదుగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

రోడ్లమీదే వరి ధాన్యం రాశులు

- నత్తనడకన వరి ధాన్యం కొనుగోళ్లు
- పట్టించుకోని అధికారులు
- పలు గ్రామాల్లో వరి కుప్పల వద్దే రైతుల పడిగాపులు

మోపాల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట పండించినప్పటి నుండి వరి ధాన్యాన్ని అమ్ముకునే వరకు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో వరిధాన్యం రోడ్ల మీద, కల్లాల వద్ద రాసులు రాసులుగా పోసి ఉంచారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు కొంత మంది రైతుల ధాన్యం కొనుగోలు చేశారని పలు గ్రామాల రైతులు వివరించారు. ఇంకా అనేక మంది రైతుల ధాన్యం ఎక్కడికక్కడ వరి పొలాల వద్ద రాసులుగా పోసి ఉంచామని పలువురు రైతులు తెలిపారు. ఇప్పటికే ఎండ తీవ్రత ఎక్కువైంది. మే నెలలో ఇంకా ఎండలు ఎలా ఉంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల ధాన్యాన్ని తొందరగా కొనుగోలు జరిగే విధంగా చూస్తే రైతులు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తెలిపారు. ధాన్యం పోయేంత వరకు అనేక మంది రైతులు ధాన్యం రాసుల వద్దనే రాత్రింబవళ్లు అక్కడే ఉండవల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు తెలిపారు. మండలంలోని బాడ్సి, మోపాల్ ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో రైతులు ఎక్కువగా ఉన్నారు. అనేక మంది రైతులు వరి తప్ప వేరే ధాన్యాన్ని పండించరు. దీంతో రెండు సొసైటీలలో కొనుగోలు కేంద్రాలు సుమారుగా నెల 15 రోజుల వరకు కొనసాగుతూనే ఉంటాయి. రైతులకు వాతావరణం అనుకూలిస్తే ఇబ్బందులు ఉండవని ఒకవేళ వర్షం పడితే రైతులకు ఇబ్బందులు తప్పవని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో జరుగుతున్న కొనుగోలు కేంద్రాలు వేగవంతంగా జరిగేలా అధికారులు చూడాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.



వరి ధాన్యం కుప్పలు

కొనుగోలు కేంద్రాలను వేగవంతం చేయాలి

● దేవయ్య, రైతు



గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మరింత వేగవంతంగా చేయాలి. ఇప్పటికే అనేక గ్రామాల్లో రైతులు ఎక్కడికక్కడ రోడ్ల మీద వారి వారి పొలాల వద్ద ధాన్యాన్ని రాశులు రాశులుగా పోసి ఉంచారు. వాతావరణం అనుకూలించకపోతే రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. మరికొన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తొందరగా కొనుగోలు చేసే విధంగా చూడాలి.


కోనాపూర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న డైట్ కళాశాల బృందం

కోనాపూర్ పాఠశాలను పరిశీలించిన రాష్ట్ర బృందం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో సదుపాయాలు సౌకర్యాలను యూ డైస్ రాష్ట్ర బృందం సభ్యులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర స్కూల్ ఎడ్యూకేషన్ డైరెక్టర్ అండ్ కమిషనర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ డైట్ కళాశాల బృందం సభ్యురాలు నాగమణి పాఠశాలలోని మౌలిక వసతులు, సౌకర్యాలు, యూ డైస్ వివరాలు పరిశీలించారు. పాఠశాల విద్యార్థుల, ఉపాధ్యాయుల పూర్తి వివరాలతో పాటు మధ్యాహ్న భోజన సదుపాయాలు తరగతి గదులు, మరుగుదొడ్ల సౌకర్యం, క్రీడాస్థలం, మినరల్ వాటర్ ఫిల్టర్, ర్యాంప్, కంప్యూటర్లు, వాన నీటి సంరక్షణ ఇంటిగ్రెటెడ్ ప్లాట్ ప్యానల్, డిజిటల్ తరగతులు, కృత్రిమ మేధా ఆధారిత బోధన, సైన్స్, గణిత ల్యాబొరేటరీలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పరిశీలన నివేదికను జిల్లా విద్యాధికారికి సమర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌడారపు రామ్ ప్రసాద్, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'న్యాయవాదులకు రక్షణ కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆర్మూర్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ అన్నారు. గురువారం బార్ అసోసియేషన్ భవన్‌లో సమావేశం ఏర్పాటు చేసుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న మంతాపురం కిశోర్ అనే న్యాయవాదిపై కొందరు కక్షిదారులు కక్షతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. న్యాయవాది స్వార్థపూరితంగా పనిచేయడని కక్షిదారుల నిజపత్రాలతోనే వాదప్రతివాదనలు చేయడం జరుగుతుందని తన వృత్తి ధర్మాన్ని మాత్రమే పాటిస్తాడని అన్నారు. న్యాయవాదులపై దాడులు రోజురోజుకు పెరుగుతూ హత్యలు సైతం జరుగుతున్నాయని ఇది సమంజసం కాదని రాష్ట్ర ప్రభుత్వం స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. రక్షణ చట్టం వచ్చేవరకు రిలే నిరాహారదీక్షలో చేయడం వెనకాడబోమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గటడి ఆనంద్, కోశాధికారి చైతన్య, న్యాయవాదులు కృష్ణాపండిత్, ఎంకే నరేందర్, ఆర్కే సురేష్, జగన్, కృష్ణంరాజు, తెడ్డు నర్సయ్య, ఖాందేష్ సంగీత, విజయలక్ష్మీ, వెంకటేశ్, షిండే పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇళ్ల స్థలాల్లో నిర్మాణం చేపట్టరాదు

● తహసీల్దార్ మాలతి

ధర్పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇప్పటికే ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని అట్టి ఇళ్ల స్థలాల్లో ఇప్పటి వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టని వారు ఇకపై అట్టి ఇళ్ల స్థలాల్లో ఏ నిర్మాణాలు చేపట్టరాదని తహసీల్దార్ మాలతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోగల తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుం టుందని ఆమె చెప్పారు. ఇకపై ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల్లో ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించారు. ఆదేశాలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. మండల కేంద్రంలో గల బీసీ కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాల్లో ఒకటి కంటే ఎక్కువ మంది కబ్జాలకు పాల్పడుతున్నారని ఇకపై అలాంటి ఖాళీ స్థలాల్లో ఎవరూ నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఆదేశాలు అతిక్రమిస్తే ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణ కింద చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె చెప్పారు. ఈ సమావేశంలో డీటీ ప్రవీణ్, ఆర్ఐ రాజేశ్వర్ ఉన్నారు.

అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


రిలయన్స్ స్మార్ట్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం


ఆర్మూర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారి

బోధన్‌రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అనుకోకుండా అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోధన్ అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్, వివిధ వ్యాపార సముదాయాలలో వినియోగదారులకు, ప్రజలకు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, నజీమ్, ఆనంద్, రాహుల్, మాసిన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు సభవించినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి

ఆర్మూర్ టౌన్: అగ్ని ప్రమాదాలు సంభ వించినప్పుడు జాగ్రత్తలు వహించాలని అగ్ని మాపక అధికారి జె. మదుసుదన్ రెడ్డి అన్నారు. గురువారం అగ్ని మాపక వారోత్సవాల సందర్భంగా పలు ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఫైర్ ఎక్టిటింగ్ విషర్స్ అలాగే ఫైర్ సిస్టం హౌజ్ రీల్స్ హైడ్రెంట్ ఉపయోగాలను వివరించి వాటితో పని చేసే విధానాన్ని ఆసుపత్రి యాజమాన్యాలకు, సిబ్బందికి తెలియజేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు రోగులను బయటకు తీసుకువచ్చే విధానాన్ని వివరించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

మద్నూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో అగ్ని మాపక సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఎల్‌పిజి వాడకం పూర్తయిన వెంటనే రెగ్యూలేటర్ వ్యాల్యూ ఆపివేయాలని, గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే రెగ్యులేటర్ వ్యాల్యూ ఆపివేయాలని సూచించారు. అటువంటి సమయంలో ఎలక్ట్రికల్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయొద్దని తెలిపారు. ప్రత్యేకంగా మహిళలు ఇళ్లలో ఉన్న సమయంలో ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఇటువంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. మండుతున్న స్టౌలో కిరోసిన్ పోయరాదని. వంట గదిలో కిరోసిన్, డీజిల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచరాదని అవగాహన కల్పించారు. ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరిగెత్తకుండా నేలపై దొర్లాలని దుప్పటి చుట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్రం ఎస్సై రాజయ్య, సిబ్బంది నర్సింలు, దిగంబర్ పాల్గొన్నారు.


మద్నూర్‌లో మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది


నీడ కోసం చెట్టును ఆశ్రయించిన మేకలు

నీడ, నీళ్ల కోసం పశువుల పాట్లు


నీళ్ల కోసం పాట్లు పడుతున్న పశువులు

మద్నూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎండలు దంచుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతుంది. ప్రజలు వేసవి కాలంలో తమకు కావలసిన సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు. కానీ నోరులేని పశువుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రజలు ఎండలకు భయపడి బయట పోవడానికి జంకుతున్నారు. పశువులు మాత్రం గడ్డి కోసం నీళ్ల కోసం నీడ కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది అయినప్పటికీ వాటికి నీళ్లు మేత దొరకక ఇబ్బందులు పడుతున్నాయి. నోరులేని పశువులు తమ తిప్పలు చెప్పుకునే పరిస్థితి లేకపోగా అవి నీడ కోసం, నీళ్ల కోసం, మేత కోసం ఎలా తాప్రతాయ పడుతున్నాయో పై ఫోటోలో కనిపిస్తున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులు నీడ కోసం చెట్లను ఆశ్రయిస్తుండగా, మేత కోసం నీళ్ల కోసం, ఎండను సైతం లెక్కచేయకుండా అడవి ప్రాంతంలో తిరుగుతున్నాయి. వేసవి మొదట్లోనే తాగునీటి పరిస్థితి, ఎండలు ఇలా ఉంటే పెద్దలు చెప్పిన సామెత ప్రకారం మే నెలలో ఎండలకు రోళ్ళు పగులుతాయన్న నానుడి నిజం కావచ్చునేమో..? గ్రామీణ ప్రాంతాల్లో గతంలో నిర్మించిన పశువులు తొట్టిలు మత్తులకు నోచుకోక నీళ్ల కోసం పశువులు చెట్టు పుట్ట వెతకాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో నిర్మించిన పశువుల తొట్టిలకు మరమ్మతులు చేయించినట్లయితే గ్రామంలోని వాటికి నీటి సౌకర్యం కల్పించినట్లు అవుతుంది.

విద్యార్థులు సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

● టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి


టీయూలో ప్రత్యేక పూజలు చేస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి


నిర్వాహకులను అభినందిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీలో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు భక్తితో హిందూ సంస్కృతిక సంప్రదాయలను కాపాడుకోవాలని ఐక్యమత్యంతో కలిసి హనుమాన్ ఆశీస్సులు పొందాలని రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి అన్నారు. గురువారం టీయూలో హనుమాన్ ఆలయం వద్ద హనుమాన్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజల కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఐఖ్యతతో కలిసిమెలిసి ఉండాలన్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలను రిజిస్ట్రార్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి ఆశోక్, కమిటీ సభ్యులు అక్షయ్, మనోజ్, శివా, వినోద్ పాల్గొన్నారు.

వైభవంగా శివగంగమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం


హసాకొత్తూర్ గోనె చెరువులో శివగంగమాత ఆలయం


గర్భగుడిలో శివ గంగామాత


హసాకొత్తూర్‌లో వలగొడుగు ఉత్సవం

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ గోనె చెరువులో కొలువుదీరి ఉన్న గంగపుత్రుల ఆరాధ్య దైవం శివగంగమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహింపబడే గంగమ్మ ఆలయ వార్షికోత్సవంలో భాగంగా తొలిరోజు గురువారం గ్రామ గంగపుత్ర సంఘ సభ్యులు వలగొడుగు ఉత్సవాన్ని నిర్వహించారు గ్రామం నుంచి గోనె చెరువులోని శివ గంగమ్మ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అర్చకులు జిమ్మెగారి అజయ్ శర్మ అద్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు జుంబెరాత్ శంకర్, కార్యదర్శి ఎల్ల నర్సయ్య, కోశాధికారి ఆల్గోట్ నారాయణ, సోసైటి అధ్యక్షుడు ఆల్గోట్ రమేష్, కార్యదర్శి నారాయణ, గంగమ్మ దేవి దీక్షపరులు, గంగపుత్ర సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. 18 శివ గంగాభవాని కల్యాణం, బోనాల సమర్పన, అన్నప్రసాద వితరణ, సాయంత్రం గంగామాతకు గోనె చెరువులో చక్రస్నానం పల్లకి ఊరేగింపు ఉంటాయని తెలిపారు.

ఎమ్మెల్యే ఆదేశించినా.. అధికారులకు పట్టదా!?

● చెరువు భూమిని సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశం ● కబ్జాలకు గురవుతున్న ఈదుల్లా చెరువు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన గల ఈదుల్లా చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుంటుంది. చెరువుకు చుట్టూ పక్కల భూములున్న ఉన్న వారు ట్రాక్టర్లతో కొద్ది కొద్దిగా చదును చేస్తూ చెరువు భూమిలోనికి వస్తున్నారు. కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్ల పేరుతో కబ్జాలకు పాల్పడుతున్నారు. ఎంతో విలువైన ఈ చెరువు భూములను కబ్జా చేయాలనే కొందరు రియల్టర్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. వేసవి దృష్ట్యా చెరువులో నీటి స్థాయి తగ్గిపోవడంతో ఇదే అదునుగా కబ్జాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొందరు మట్టి కుప్పలను చెరువుల్లో వేసి కబ్జాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ విషయంలో ఇప్పటికే నడిపల్లి గ్రామస్థులు స్థానిక ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన రెవెన్యూ అధికారులను పిలిచి మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువు భూమిని కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక తహసీల్దార్‌కు సూచించి ఏడాది గడిచిన ఇంత వరకు చర్యలు తీసుకోలేదు. సర్వే చేయించి చెరువు చుట్టూ హద్దు రాళ్ల వేయించి కబ్జాలు అడ్డుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అయిన ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో కబ్జా రాయుళ్లు మరింత రెచ్చిపోతు న్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎమ్మెల్యే ఆదేశాల ను పట్టించుకొని చెరువు హద్దులను గుర్తించి చెరువును కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


చెరువు కబ్జాపై తహసీల్దార్‌తో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి (ఫైల్)


డిచ్‌పల్లి మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న ఈదుల్లా చెరువు ఇదే

పంచాయతీ వర్కర్లకు జీవో 60 ప్రకారం జీతాలు పెంచాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వర్కర్లకు జీవో 60 ప్రకారం జీతాలు పెంచాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టీయూసీఐ నాయకుడు ప్రకాష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12769 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ప్రభుత్వం దగ్గర నమోదైన 54 వేల రెండు వందల మంది నమోదు కాని సుమారు 13వేల మంది వర్కర్లపై సమగ్రంగా విచారణ జరిపి జీవో 60 నెంబర్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినహామీ మేరకు పర్మినెంట్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ గ్రాట్యూటి చట్టాలు అమలు చేయాలని తెలిపారు. ఈ చట్టాన్ని అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని తెలిపారు.


పశువులకు టీకాలు వేస్తున్న పశు సంవర్ధక శాఖాధికారి

251 పశువులకు టీకాలు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్, తిమ్మారెడ్డి గ్రామాల్లో గురువారం పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పశువైద్యురాలు అర్చన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధశాఖాధికారి సంజయ్ కుమార్ ఆకస్మాత్తుగా తనిఖీ చేసి శిబిరంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ శిబిరంలో 215 గేదెలకు, 36 తెల్లజాతి(ఆవులు,ఎద్దులు) పశువులకు మొత్తం 251 పశువులకు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి మండల పశు వైద్యసహాయ సంచాలకులు సాయిరెడ్డి, పశువైద్యులు విజయకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది మహబూబ్, రమేష్‌స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలి

రాజంపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): రాజంపేట రైతు వేదికలో గురువారం రైతు వివరాల నమోదుపై ఏడీఏ అపర్ణ ఏఈవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్‌తో దేశంలోని ప్రతీ పౌరునికి గుర్తింపు ఇచ్చినట్లుగానే ప్రతీ రైతుకు 11 నెంబర్‌లతో విశిష్ఠ సంఖ్యని కేటాయించాలని కేంద్రం నిర్ణయించిందని, ఫార్మర్ రిజిస్ట్రీ పేరుతో యాప్‌ను రూపొందించి వ్యవసాయశాఖకు బాధ్యతలు అప్పగించిందన్నారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రీలో వ్యవసాయ విస్తరణాధికారులు ఆయా ప్రాంతాలకు చెందిన రైతుల వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏవో తబసుమ్, కామారెడ్డి ఏవో పవన్, బీబీపేట ఏవో నరేంద్ర, పాల్వంచ ఏవో శ్రీనివాస్, భిక్కనూరు ఏవో శోభ, దోమకొండ ఏవో మణిదిపిక, రాజంపేట ఏవో శృతి,మాచారెడ్డి ఏవో పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలను పక్కాగా పరిశీలించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం ఎంపీడీఓ, ఎంపీఓ, ఆర్‌డీఓ, మున్సిపల్ కమిషనర్‌లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18 నుండి 21 వరకు ఇందిరమ్మ కమిటి సభ్యులు లబ్ధిదారులను పరిశీలించాలని, నిరుపేదలు, మట్టి ఇళ్లు, రేకులషేడ్, గుడిసెల్లో నివసిస్తున్న వారిని గుర్తించాలని తెలిపారు. ఈనెల 22 నుండి 30 వరకు ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితాలను లబ్ధిదారులు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీఓలు, పంచాయతీ రాజ్, హౌసింగ్ తదితర గెజిటెడ్ అధికారులు బాధ్యతగా వేరిఫై చేయాలని అన్నారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇల్లు మంజూరు చేయవలసి ఉంటుందని తెలిపారు. పరిశీలించిన జాబితాలను మే 2 న సంబంధిత గ్రామ పంచాయతీ/వార్డులో బోర్డుపై ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. మే 3 నుండి 5 వరకు వెరిఫై చేసిన జాబితాను జిల్లా మంత్రి గారి ఆమోదంనకు సమర్పించాలని తెలిపారు. జాబితాలోని లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసి మంజూరు ఉత్తర్వులు పొందాలని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

పోలీసులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

రామారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో పరిసరాలను ఎస్పీ పరిశీలించి స్టేషన్‌లో రికార్డులను స్టేషన్ బంధువులను పాత నేరస్తులపై నిఘా ఉంచాలని పెట్రోలింగ్ క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్ రమణ, ఎస్సై వై. నరేష్, ఏఎస్ఐ రవీందర్, హెడ్ కానిస్టేబుల్ స్వామిగౌడ్ పాల్గొన్నారు.

గొల్లపల్లిలో విద్యుత్ శాఖ అధికారుల పొలంబాట

రామారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఎస్ఎస్ 14(100కేవీఏ) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులతో విద్యుత్ శాఖ అధికారులు గురువారం పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి డివిజనల్ ఇంజనీర్ టెక్నికల్ ప్రభాకర్ రావు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులకు కెపాసిటర్ యొక్క ఉపయోగాలను తెలుపుతూ తమ యొక్క బోరు బావులకు విధిగా కెపాసిటర్లు బిగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామారెడ్డి విద్యుత్ శాఖ ఏఈ బి. లక్ష్మీ నరసింహ, రామారెడ్డి లైన్ ఇన్స్పెక్టర్ యేసు రత్నం, లైన్మెన్లు మోహన్ సింగ్, అసిస్టెంట్ లైన్మెన్ రమేష్, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామి బాధ్యతల స్వీకరణ

నసురుల్లాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల గిర్దావర్‌గా వెంకట స్వామి గురువారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత కాలం ఇక్కడ విధులు నిర్వహించిన సాయిలు నిజాంసాగర్‌కు బదిలీ అయ్యారని ఆయన అన్నారు. సీనియర్ అసిస్టెంట్‌గా అలీమ్ ఇక్కడ బాధ్యతలు నిర్వహించగా ఆయన ఆర్డీవో కార్యాలయానికి బదిలీ కాగా అతని స్థానంలో ప్రియాంక బాధ్యతలు స్వీకరించినట్లు ఆయన పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తోట

పిట్లం, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని జుక్కల్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎకరానికి గతంలో 8 క్వింటాలు కొనుగోలు చేశారని, దానికి ఎకరానికి 14 క్వింటాలు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్ కుమార్, వైస్ చైర్మెన్ కృష్ణారెడ్డి, విండో చైర్మెన్ శపథంరెడ్డి, మండల అధ్యక్షులు హన్మండ్లు, రాంరెడ్డి, శ్రీరాములు, మొయిన్, రవి, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, రైతులు, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

దోమకొండ: ఐకేపీ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. మండలంలోని గొట్టిముక్కుల, సీతారాంపల్లి గ్రామాల్లో ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ సంజయ్‌రావ్ అధికారులతో కలసి ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం విక్రయించాలన్నారు. ఏ గ్రేడు రకంకు రూ. 2320, బి గ్రేడ్ రకంకు రూ. 2300 మద్దతు ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీన్ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఏపీఎం రాజు, ఏఈవో మాన్యాష, కార్యదర్శి భానుశ్రీ,సీసీలు ప్రవీణ్, రమేష్,తాటిపల్లి శ్రీకాంత్, శ్రీనివాస్, సీఏ రాజు, రమేష్, రాంచంద్రం గ్రామస్తులు పాల్గొన్నారు.

బీర్కూర్: రైతులకు ధాన్యం తాలూకు డబ్బులు త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డిఓ సురేందర్ ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బీర్కూర్, నసురుల్లాబాద్, మద్నూర్, మండలాల ఏపీఎం, సీసీలు, వీఓఏలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ధాన్యం బస్తాలను వెను వెంటనే రైస్ మిల్లులకు పంపాలన్నారు. ధాన్యం డబ్బులకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేసి రైతులకు డబ్బులు చెల్లించాలని సూచించారు. ఈ సంవత్సరం ప్రారంభం నుండే ప్రతి వీఓకు ఒక ప్రత్యేక ప్రణాళిక ఉండాలన్నారు. ఆదాయ మార్గాలు ఎంచుకుని ఆదాయం పెంచుకోవాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల యూనిఫామ్ స్టిచ్చింగ్ చేయించాలన్నారు. మహిళా శక్తి, బ్యాంకు లింకేజీ, ఐబీ, లోకోస్ తదితర ఆదాయ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు, సుధాకర్, రమేష్ బాబు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో..

రాజకీయ కక్ష్యతోనే ఈడీ కేసులు

ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్


బాన్సువాడలో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్ష్యతోనే తమ నాయకులైన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ తప్పుడు కేసులు నమోదు చేసిందని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ మీద కక్ష్య సాధింపు చర్యలు చేపట్టిందని, దేశంలో కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల ఓర్వలేక తమ పార్టీ నాయకులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మెన్ ఎర్వల కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, ఏజాస్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాలేక్, యువజన అధ్యక్షుడు చిన్న, నార్ల సురేష్, వాహబ్, రవీందర్, హకీం, సాయిలు తదితరులున్నారు.

సదాశివనగర్‌లో ప్రధాని దిష్టిబొమ్మ దహనం

సదాశివనగర్: నేషనల్ హెరాల్డ్ ఆస్తుల అవకతవకలపై ఈడీ చార్జ్ షీట్‌లో రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ పేర్లు చేర్చడం బీజేపీ దిగజారుడుతనానికి నిదర్శనమని మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, సీడీసీ చైర్మన్ అర్షద్ అన్నారు. గురువారం సదాశివనగర్ మండల కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంకోసం ప్రాణత్యాగాలు చేసిన ఇందిరాగాంధీ కుటుంబానికి చెందిన వారిపై అవినీతి ఆరోపణలు చేయడం మంచిది కాదని అన్నారు. ఎలాంటి మలినం లేకుండా రాహుల్‌సోనియాలు బయటపడుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి,యువజన నాయకులు సంపత్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ గంగాధర్, రూపేందర్‌రెడ్డి, రాజేందర్, బాలరాజు, భూమిరెడ్డి, సంగయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సంపూర్ణ ఆరోగ్యం, పరిశుభ్రతే లక్ష్యంగా కార్యాచరణ

మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ ప్రమీల



అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న పీడీ ప్రమీల

మద్నూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని, సంపూర్ణ ఆరోగ్యం పరిశుభ్రతే లక్ష్యంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ ప్రమీల అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా రైతు వేదికలో మద్నూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ వరకు కార్యకర్తల సమావేశంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటి వద్ద సమతుల ఆహారం అందించడంపై పేదరికం, కుటుంబ పరిస్థితులు తదితర కారణాలతో తల్లిదండ్రులు తగిన శ్రద్ధ చూపటం లేదని వారికి పోషకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సంపూర్ణ ఆరోగ్య సమాజం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి పోషణ పక్షం 2025 పోషణ అభియాన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టినట్లు ఆమె వెల్లడించారు. ఈ నెల 22 వరకు ఈ కార్యక్రమాలు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కొనసాగించాలని తెలిపారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో ఆరోగ్యకరమైన అంశాలపై ఐదు రోజులపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చిరుధాన్యాలతో కలిగే లాభాలు పరిసరాల పరిశుభ్రత పోషకాహార అవగాహన చిన్నారులకు అన్నప్రాసన ,అక్షరాభ్యాసం చేయించడంతో పాటు రక్తహీనతతో కలిగే నష్టాలు కిశోర బాలికలకు అవగాహన సదస్సు తదితర కార్యక్రమాలను గ్రామాల్లో చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, సిడిపిఓ కళావతి, ఎఐఐఎంయస్ జిల్లా కోఆర్డినేటర్ మోహన్, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ ప్రియాంక, సూపర్ వైజర్‌లు, అంగనవాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

వరి గడ్డికి భలే డిమాండ్

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): గత ఖరీఫ్ సీజన్‌లో జుక్కల్ నియోజక వర్గంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురియలేదు. దీంతో నిజాంసాగ్ మండలం మినహా నియోజకవర్గంలోని మిగతా మండలాలలో చెరువులు, కుంటలు నిండలేదు. దీనిని దృష్టిలో ఉంచుకుని చెరువుల కింద పంట సాగు చేసే రైతులు వరిని సాగు చేయలేదు. ఖరీఫ్‌లో వ్యవసాయ బోరుబావుల దగ్గర వరిని సాగు చేసిన రైతన్నలు రబీలో మాత్రం వరి పంటను సాగు చేయక జొన్న, మొక్కజొన్న లాంటి పంటలను సాగు చేశారు. దీంతో పశువుల గ్రాసానికి ఇబ్బంది ఏర్పడింది. బాన్స్‌వాడ నియోజక వర్గంలో నిజాంసాగర్ ప్రాజెక్ట్ నీటిని ఆధారంగా చేసుకుని వరి పంటను భారీగా రైతన్నలు సాగు చేశారు. ప్రస్తుతం ఆ పంట చేతికి రావడంతో వరి కోతలు పూర్తి కావస్తున్నాయి. దీంతో జుక్కల్ నియోజక వర్గంలో గల రైతన్నలు బాన్స్‌వాడ ప్రాంతం నుండి వరి గడ్డిని ఖరీదు చేసుకుని జుక్కల్ ప్రాంతానికి తీసుకవస్తున్నారు. రానున్న ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు పూర్తయ్యేవరకు ఈ వరిగడ్డిని పశువులకు మేతగా వినియోగించుకుంటామని రైతన్నలు తెలిపారు.


వరి గడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని రోడ్లు, మురికి కాలువలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో కార్మికుల హాజరు పట్టికను ఆకస్మికంగా తనిఖీ చేసి కార్మికుల హాజరు నమోదు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో పరిశుభ్రత ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత కార్మికులపై ఉందని అన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


హాజరు పట్టికను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నసురుల్లాబాద్ ఇన్‌చార్జిగా నారెడ్డి మోహన్‌రెడ్డి

రామారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లాలోని బాన్సువాడ సెగ్మెంట్ నసుల్లాబాద్ మండలంలో నిర్వహించనున్న జై భీమ్, జై బాబు, జై సంవిధాన్ కార్యక్రమానికి మండల ఇంచార్జిగా రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డిని నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులు జారీ చేసినట్లు నారెడ్డి మోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎలాంటి బాధ్యతలు ఇచ్చిన, పార్టీ కోసం పనిచేస్తానని, పార్టీతోపాటు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.


మల్లూరులో ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

ఎరువుల గోదాం తనిఖీ

నిజాంసాగర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఎరువుల దుకాణాలు, గాయత్రి చక్కెర కర్మాగారంలో ఉన్న ఎరువుల గోదాంలను గురువారం బిచ్కుంద డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు అమీనాబీ తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువుల నిల్వలు, నిల్వ పట్టికలు, నిల్వ రిజిష్టర్‌లు పరిశీలించారు. ఆధార్ కార్డు తీసుకుని వచ్చిన రైతులకు ఈపీవోఎస్ యంత్రం ద్వారా అవసరమైన ఎరువులు విక్రయించాలని ఆదేశించారు. అధిక ధరలకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్, ఏఈవో సాగర్, సీఈవో సాయిలు తదితరులు ఉన్నారు.

డోంగ్లీ ఆర్‌ఐగా సాయిబాబా

మద్నూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : డోంగ్లీ మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా గురువారం సాయిబాబా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఆర్ఐ బదిలీపై వెళ్లిపోగా ఆయన స్థానంలో సాయిబాబాను నియమించింది. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవాలలో ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తానని అన్నారు.

దొంగకు దేహశుద్ధి

గాంధారి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గాంధారి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గురువారం దొంగతనం చేస్తున్న వ్యక్తికి గ్రామస్తులు దేహశుద్ధిచేశారు. బాన్సువాడ గ్రామం నుండి ఒక వ్యక్తి బోధన్ నుండి మరోక వ్యక్తి తిమ్మాపూర్ గ్రామానికి వచ్చి వ్యవసాయభూముల వద్ద మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను దొంగతనంగా తీసుకెళ్తుండగా గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

స్వగ్రామానికి చేరుకున్న మృతదేహం

రామారెడ్డి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామానికి గురువారం చేరుకున్న బట్టు సురేష్ (35) మృతదేహం చేరుకొంది. గత నాలుగు రోజుల క్రితం దుబాయిలో వలస కార్మికుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించడం జరిగింది. ఇండియన్ ఎంబసీ అబ్దుల్ గవర్నమెంట్ సహకారంతో బట్టు శంకర్ ద్వారా తన మృతదేహాన్ని క్షేమంగా ఇంటికి చేర్చారు. చనిపోయిన వ్యక్తికి భార్య నవనీత, ఇద్దరు కుమారులు విశ్వ, షియాన్ష్ ఉన్నారు. ఈ మేరకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి, అధికారులు స్పందించాలని ఆయన కోరారు.


ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పెద్దవాగులో ట్రెంచ్ ఏర్పాటు

రాజంపేట, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం, నడిమితండా, ఎల్లాపూర్ తండాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నరనే సమాచారంతో పెద్దవాగులో ట్రెంచ్ కటింగ్ ద్వారా మూసివేశామని తహసీల్దార్ సతీష్‌రెడ్డి తెలిపారు. ఎవరైన అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పుష్పరాజ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బాబా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన మండల కమిటీ

మున్నూరుకాపు పటేల్ సంఘం మండల కమిటీ ఎన్నిక

గాంధారి, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): మున్నూరుకాపు సంఘం, మండల పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. గురువారం గాంధారి మండల కేంద్రంలో సమావేశమైన మున్నురుకాపు కులస్తులు, మండల, పట్టణ కమిటిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గాంధారి మండలం మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా ఆకుల బాలకిషన్, ఉపాధ్యాక్షుడిగా సింగసాని పండరి, పత్తిశివకుమార్, కూచి గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా సాయిలు, కోశాధికారిగా తాడ్వాయి విఠల్, జాయింట్ సెక్రటరీగా వెంకట్, గాంధారి పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా పత్తి సాయిలు, ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, ఉపాధ్యాక్షులుగా బండారి రమేష్, పత్తిరవి, కోశాధికారిగా నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ మండలంలోని మున్నూరుకకాపు కులస్తుల అభివృద్ధి కోసం తాము కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు సంతోష్, లక్ష్మన్, గంగాధర్, గోపాల్‌సాయిలు, రామస్వామి,రవి,రమేష్, నేరెళ్లమధు, బాలయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి	
దర్శన్	- గుడ్ బ్యాడ్ అగ్లీ
ప్రియా 70	- జాక్
ప్రియా 35	- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి

బాన్సువాడ	
మహేశ్వరి	- జాక్
వెంకటేశ్వర	- అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

